# ధర్మసాధని

[బ్రాహ్మసాధనాశ్రమ పక్షమున ప్రతిశనివారము ప్రకటింపబడును.]

ధర్మంచర । ధర్మాత్ పరం నాస్తి । ధర్మః సర్వేషాం భూతానాం మధు.

సంపుటము ౮. | కాకినాడ:—శనివారము, ౧౮, జూన్, ౧౯౨౧. (18 1921) | చందా సం॥ రు 3.
సంచిక ౨౪. | | విడిసంచిక అ ౧.

## ఓమ్.

శాంతిదాతా! పరమేశ్వరా! మా హృదయములు సంక్షోభమును చెందియున్నవి. అశాంతి మాలో తీవ్రముగా రాజ్యము చేయుచున్నది. మా కష్టములకు లెక్కలేదు. మా శోధనలకు మితిలేదు. మా దుఃఖములకు అంతములేదు. మా ఆశాభంగములకు మేరలేదు. ఏవైపున జూచినను మనస్తాపము. ఇక దినముల నెట్లు గడపుదుము? జీవితము నెట్లు వెళ్ళబుత్తుము? ప్రాణనాథుడవు "నీవు ఉన్నావు" అను విశ్వాసమే మాకు రవంత ధైర్యము నిచ్చుచున్నది. కలతజెందిన మా మనస్సులపై శాంతిసుధను కురిపింపుము. మమ్ము ఉత్సాహవంతులను జేయుము. నిరాశా సముద్రమునుండి తప్పించి మమ్ము ఒక దరికి జేర్పుము. శాంతి ప్రదాతా! నీవు మాకు సాహాయ్యము చేయకున్న నెవ్వరు చేయగల్గుదురు. నీకు మా ప్రణామములు.

---

## స్వాతంత్ర్యము.

స్వాతంత్ర్యము ఆత్మయొక్క ఒక అవస్థాభేదము. అది శారీరకము గాదు. మానసికము. ఒకడు ధర్మశాస్త్రానుసారము బానిసగానే యుండవచ్చును కాని మానసికముగా స్వతంత్రుడు కావచ్చును. మరియొకడు భాగ్యవంతుడయ్యు అస్వతంత్రుడుగా నుండవచ్చును. శరీరము మనస్సును వశము చేసికొన్నచో అస్వతంత్రుడు. మనస్సు దేహమును వశము చేసికొన్నచో స్వతంత్రుడు. పొలములో మేయునప్పుడు ఎద్దుయొక్క ముక్కునకు ఒక పోగు ఉండును. దేహాధీన మనస్కులగు అనేక మనుష్యుల స్థితియు నిట్టిదే. నాసికకు ఒక పోగున్నతరువాత అది బంగారముతో చేయబడినదైన నేమి మరెట్టిదానితో చేయబడిన నేమి?

---

## మృగశిరా ప్రవేశము.

సూర్యాతపము అధికమై, వేడిగాడ్పులు తీక్ష్ణములై దినములు దుర్భరములైనపుడు జనులు మృగశిరా ప్రవేశము కొరకు నిరీక్షింప సాగెదరు. సూర్యుడు మృగశిరలో ప్రవేశింపగనే తొలకరించును. కాలవైఖరి మార్పుచెందును. తమ జీవితము పాపభూయిష్ఠమై హృదయవేదన మగ్గలమైనప్పుడు మానవులు ఈశ్వరానుగ్రహ వృష్టికై యెదురు చూడ నొడంగెదరు. భగవంతుని దయావర్షము తొలకరించె నేని మన జీవితములో నొక నూతన ప్రకరణము ప్రారంభమగును. జీవితముయొక్క ధోరణియే మారిపోవును.

పా. న.

---

"క. పరికింపఁగ నేమనుజుఁడు
హరిపదమును బొందఁ జేయునట్టివివేక
స్ఫురణం దనర్చు వానికిఁ
బరువడి నిలఁ బొంద రానిపదముం గలదే."

---

# అజ్ఞానధ్వంసకాగ్నేయాస్త్రములు.

—:o:—

శ్రీ ఆదిపూడి సోమనాథరాయ కవిగారు.

గీతమాలిక.

రిపుల బ్రేమింప నిక నీకు రిపులు గలరె?
అరుల బ్రేమించుటే కద యరిజయమ్ము
ఎవఁడు ద్వేషించు వాని ప్రేమింతు వేని
నాతఁ డలుగఁగాఁడ నేమి చేయంగ గలఁడు?
పరమశత్రుని యందును భవ్యమైన
దివ్యమిత్రునె చూడుము తెల్లమిగాఁగ;
బలము గలవారె యోర్చుకో గలరు గాన
దూఱువాతఁడు దూఱుతో మ్రింగనిమ్ము
అతని దూఱులకును నెదు రాడఁబోకు;
తప్పుసాక్ష్యము నినుగూర్చి చెప్పువాని
కెదురు పల్కిన నతని రక్షింప నదియె
కారణంబగు నొక్కొక్క కాలమందు
గాన మాటాడకుండుటె కడు సుఖమ్ము;
అంత స్వల్పమ్ముగాను సర్వాత్మ కుండు
వ్యక్తమగు చుండ నొక్కొక్క వ్యక్తియందు
వ్యక్తినిం దూఱ నేటికి వ్యర్థముగను?
తప్పిదము వోలె శిక్షయు ధర్మమంచు
బ్రకట పఱుపంగ నెంతయో పాటుపడును;
కాలమే సత్యముఁ జూప జాలియుండు;
సంగ్రహించిన శస్త్రాస్త్ర సంఖ్యఁబట్టి
కొన్ని జాతుల వారికే యున్న యట్టి
హక్కునే సభ్యతగ నెంచు రకట జనులు;
తగిన కాలోచితాస్త్ర శస్త్రములు లేమి
కను నసభ్యతగా నెంత్రు పడమి నుండు;
అగపడదు దేవుఁ డెంతయు వ్యాప్తుఁడగుట;
మహిని నొక విగ్రహము దేవు మఱుగు పఱచు
వానినే పలుమారులు ప్రకట పఱచు;
అల్పమౌఢ్యంబు జనులను నవని యందు
మ్రొక్క జేయును ఱాళ్ళకు మ్రోఁకులకును;
అధిక మౌఢ్యంబు దానిని నాప జేయు
తాను బ్రేమించునది యెల్ల దైవమునకు
నిచ్చుటే కాదయనేసి ప్రేమించు టనగ
గాన వసుధాతలమ్ము స్వర్గమ్ము గాను
జేయుటయె స్వర్గవాసమై చెలగుచుండు;
దేనియును గోరకుండెడు ధీరమతులె
పరులు గోరిన నెల్లను బడయుచుండ్రు
గాన వారలె ధన్యులై శ్రీల గలరు;
అందరు పరస్పరము పోధి మ్రింది నపుడు
సమసి పోవక యుందురు సాధుజనులు
గాన వారలె ధన్యులై శ్రీల గలరు;
భువిని దేనను మమకార బుద్ధిలేని
వారినే సర్వమును వచ్చి చేరుగాన
వారలే ధన్యతములయి వఱల గలరు;
న్యాయమును బూని న్యాయాలయంబునందు
శిక్షలను బొందు చుండెడు శిష్టమతులె
ధన్యతములయి ధరలోన దనర గలరు;
వస్తుతము నేరములు మోప బడెడు వారు
భావి సంతాన మగునట్టి వారు గాన
ధన్యతములయి ధరలోన దనర గలరు;
బీదవారల పనులలో మోన మొప్ప
ధనికులిల బాలుగొనిన నౌదార్యమగును;
విత్తవంతుల పనులలో బీదవారు
పాలుగొనిన నరాజక భావమగును;
నీవు నమితోప భోగముల్ నిజము గాను
పరుల యుపవాస హేతువై పరగుచుండ;
కలిమి బుణపడి యుంటను దెలియ జెప్ప
ఈబడిన నీవు దానికే యీశ్వరుండు
మించు దయతోడ నిన్ను క్షమించునంత.

(Paul Richard.)

---

# లంచము.

—:o:—

[శ్రీ ఉమర్ అలీషా కవిగారు.]

నౌషేర్వాన్ అను ఈరాన్ దేశపు చక్రవర్తి వేటకు బోయి పెక్కుజంతువుల దన నిశితశరపరంపరకు గురిచేసి తన సహచరులతో గుడారమునకేగి వేటాడిన జంతువుల మాంసమును కాల్చి తినవలెనని యుద్యుక్తుడై యున్న నవసరమున నుప్పు తక్కువ వచ్చినది.

ఆ సమీప గ్రామమునకు సేవకుని పరువెత్తించి దేశ మరాజకమై వినాశనము గాకుండ ఉప్పు వెలకు గొని తెమ్మని రాజు మంత్రి కాజ్ఞాపించెను.

మంత్రి అది విని, ఉప్పు వెలకుగొని తేనంత మాత్రమున, దేశమున కేమి హాని సంఘటించును? ఏగాని యిట్టి కొన్న యుప్పు నేలాగువాడినా యేడాది

గడుచును గదా! ఇది మిగుల వింతగానున్నది అని ప్రత్యుత్తర మిచ్చెను.

రాజువాని యవజ్ఞతను నిందింపుచు

"ప్రపంచమున ప్రజాపీడ నాంకురము తొలుదొల్త మిగుల సూక్ష్మముగనే ప్రారంభమై యది కాలము గడచినకొలది, యది యభ్యాసమైన కొలది నేడుప్పు తీసికొన్న వాడు రేపు ముప్పున కాస్పదమైన ముత్యాల పేటలను కాంచన తార హారములను గైకొన గలడు.

కం. హాళికుని పొలమునుండి న్నృ
పాలుఁడు నొక కాయఁగోసి భక్షించినఁ ద
త్పాలము మూలము నండియు
దూలింతురు దాసదాసి తొత్తులు బాళిన్.

కం. వెల నిడక తేఁకు పురమున
బలిమిని నైదారు గుడ్లు బడసిన వీటన్
జెలరేఁగి తత్భటావళి
బలి గావించెదరు వేలు వందలు కోళ్లన్."

అని చెప్పెను.

(సాది అనువాదము.)

---

# ప్రేమ ప్రభావములు.

—:o:—

ఈశ్వరుని జీవుని ప్రకృతిని బాగుగ గుర్తించుటయే ఈ మూడు విషయముల సాక్షాత్కరించుట. ఈశ్వరు డెక్కడ నున్నాడు? జీవు డెక్కడ? ప్రకృతి యెక్కడ? ఒక మానవు డితర మానవునకు ప్రేమ సమన్వితుడై దానమిడుచుండ జూచితివేని, ఈశ్వరు డట్టి దానకర్త యొక్క హృదయమునం దున్నాడని గుర్తెరుంగుము. ఒక మనుజుడు, ఇతర మనుజునిచే ప్రేమపూరితుడై దానమును స్వీకరించుచుండ జూచితివేని, జీవు డట్టి స్వీకరించు వాని హృదయమున నున్నాడని గుర్తించుము. ఒక్క నరుని, వేరొక నరునిచే ప్రేమదానమును స్వీకరించుచున్నట్లు, తిరిగి తానిచ్చుచున్నట్లు జూచితివేని, అట్టి ప్రేమదానమే ప్రకృతియని తెలియుండగు. ఇదియే, ఈశ్వరుడు, జీవుడు, ప్రకృతి ఉండు ప్రదేశముల యొక్క అత్యద్భుతములగు మర్మములు. కాని, వానిని మనము కడు శ్రద్ధాభక్తులతో దెలిసికొన బ్రయత్నించ వలయును.

ఈశ్వరు డనగా నేమి? జీవుడన నేమి? ప్రకృతి యన నేవి? ఈ ప్రశ్నలకు గూడ పై ఉత్తరము లే సమాధానములు. ఈశ్వరుడు ప్రేమ స్వరూపుడు. ఏలన, ప్రేమవల్లనే ప్రేమ వెల్లడింపబడును. జీవుడన్నను ప్రేమయే. ఎందుకన, ప్రేమవల్లనే ప్రేమ స్వీకరింపబడును. ప్రకృతిగూడ ప్రేమయే. అదెట్లనిన, ప్రేమయొక్క ఇచ్చి పుచ్చుకొనుట యందే ప్రేమను వెల్లడించుట కవకాశ ముండును. ఇది, ఈశ్వరుడు, జీవుడు, ప్రకృతియొక్క స్వరూపములని చెప్పబడును. కాని మనము వానిని మహా భక్తి శ్రద్ధలతో గ్రహించవలసియుందుము.

ఈశ్వరు డేమి చేయును? జీవు డేమి చేయును? ప్రకృతి యేమి చేయును? వీని సమాధానములు గూడ పై ప్రత్యుత్తరములందే యున్నవి. ప్రేమను దానము చేయుడము, ప్రేమను స్వీకరించడము, ప్రేమను ఇచ్చి పుచ్చుకొనడమే ఈశ్వరుడు, జీవుడు, ప్రకృతి జేయు పనులు. ఇదియే పరమ రహస్యము. కాని మనము వానిని కేవలము నిష్కళంక మగు హృదయముతో దెలిసి కొనవలయును.

కే. రాములు.

---

# సమాచారము.

—:o:—

మహాత్మా గాంధి, లజపతిరాయి మొదలగు దేశనాయకులు వైస్రాయిగారితో రహస్య సంభాషణ జరుపుట, సంభాషణ విషయములు జనులకు తెలియకుండ నుంచుట తగదని అమృతబజారు పత్రిక అనుచున్నది.

ఇంగ్లాండులో హౌసు అఫ్ కామన్సునందు వైకౌంటు కర్జన్ గారు గాంధి రీడింగుల సంభాషణ విషయము లేవి యనియు, రీడింగు గారు సహాయనిరాకరణమునకు అనుకూలురుగ నున్నారా యనియు మాంటేగ్యు గారిని అడిగిరి. సంభాషణ ఇన్ఫార్మల్ (రహస్యమైనది) కనుక వైస్రాయి ప్రకటించుటకు సమ్మతింపదనియు, రెండవ ప్రశ్నకు ఆధారము కనపడదనియు, మాంటేగ్యు గారు జవాబుచెప్పిరి.

క్రొత్త ఆక్టు ప్రకారము ఏర్పడిన కాకినాడ మునిసిపలు సభ్యుల మొదటి సభ 3 వ తేదిన జరిగెను. ఆసభయందు, దివాన్ బహద్దరు కొమ్మిరెడ్డి సూర్యనారాయణమూర్తి నాయుడు గారు చైరుమన్ గాను, దుగ్గిరాల సూర్యప్రకాశరావు పంతులు గారు వైస్ చైరుమన్ గాను ఎన్నుకొనబడిరి.

చీరాలలో సహాయ నిరాకరణోద్యమము నడుపుచున్న దుగ్గిరాల గోపాల కృష్ణయ్యగారికి గుంటూరు మండలసభ 'ఆంధ్ర రత్న' అను బిరుదము నొసంగెను.

సహాయ నిరాకరణోద్యమ నాయకులు గజపిల్లి రామచంద్రరావు ఎమ్. ఏ గారు రాజమండ్రి మునిసిపాలిటికి చైర్మాను గా నెన్నుకొనబడిరి.

ఈ మాసాంతమంతయు టంగుటూరి ప్రకాశము పంతులు గారు ఆంధ్రదేశ వివిధ భాగములలో సంచారము సలుపుదురు.

---

సత్యమేవ జయతే

ధర్మసాధని.

శనివారము, జూన్ ౧౮, ౧౯౨౧.

# ప్రార్థనాదినము.

——:०:——

ఇంగ్లాండు దేశములో కాంటరుబరి, యార్కు బిషప్పులు ప్రార్థనాదినముల యొద్ధి కారు లందరితో సంప్రదించి [illegible]౨౧ వ తేదీన ఇర్లాండును, పారిశ్రామిక అంతర్జాతీయ పరిస్థితులను, బ్రిటిష్ జాతిని, ప్రపంచమును గూర్చి ఈ సంకట సమయమున ప్రార్థనా మందిరము లన్నిటిలో ప్రార్థన జరపుటకు నిశ్చయించిరి. ఈ కాలమున మానవుడు తన శక్తిపై నాధారపడియె సామాన్యముగ జీవితము గడుపుచున్నట్లు కాన్పించును. పాశ్చాత్య దేశములలో ప్రకృతి రహస్యములు, శరీర గుణస్వభావములు బాగుగ పరిశీలింపబడి నిర్ణయింప బడినవి. ప్రాకృతిక శక్తులను వశపరచుకొని ప్రయాణ సౌకర్యములు, భోజన సదుపాయములు మున్నగునవి యెన్నియో అనుభవించుటకు, శరీరారోగ్య బలములు సంపాదించుకొని అత్యంత సుఖజీవనము గడపుటకు, అచ్చటి జనులు సమర్థులగు చున్నారు. మనుష్యుడు నిర్వహింపజాలనిది యెద్దియును ప్రపంచమున లేదు అని చూపుటకే యున్నట్లు వారి శక్తి సామర్థ్యములన్నియు వినియోగ పడుచున్నవి. పాశ్చాత్యులు ఒక ప్రాణము పోయుట తప్ప మిగిలినవన్నియు చేయుచున్నారనియు, ఆ పని గూడ త్వరలోనె చేసివేయురనియు సామాన్యముగ చెప్పకొనబడుట యెల్లరెరింగిన విషయము. దేవుని గూర్చి ప్రాగ్దేశములందు విశేష [ప్ర]శంస కానబడుచున్నను, నేడు మనము పాశ్చాత్యులనె యనుకరించుచు ప్రాకృతిక జీవనము గడపుట కుద్యుక్తు లగుచున్నారు. ప్రపంచమునందీ కాలమున మొత్తము మీద అందరు ఈశ్వరుని మీద కంటె ప్రకృతిమీద, ఆత్మమీద కంటె శరీరము మీద నెక్కుడు దృష్టి నిలిపి ఆధ్యాత్మిక జీవనమునకు దూరులగుచు సర్వము పురుషాధీన మను అహంకారముతో విఱ్ఱవీగు చున్నారు. కాని ఈ ప్రాకృతిక యుగమునందును ఈశ్వర ప్రార్థన కేవలము త్రోసివేయ బడలేదని తెలుపుటకు పైని పేర్కొన బడినట్టి తీర్మానములు నిదర్శనములుగా నుండును.

'పురుషాధీనం కించిన్నాస్తి, బ్రహ్మాధీనం సర్వమిదం' అను మహామంత్రరహస్యము తెలిసిన వారలె ప్రార్థన సలుపగలరు; ప్రార్థన మూలమున బలము బడయగలరు. సర్వము పురుషాధీనమని గర్వించువారు తమకు తోచినట్లు నడచుకొందురె గాని ప్రార్థనా సాహాయ్య మపేక్షింపరు. కాని యెందులకు ప్రార్థనకై యీ హెచ్చరికలు? అవి ఆచార వశముగ చాలవరకు జరుగుచు వచ్చునవియె యైనను వానియందు ప్రకటిత మగునది వట్టి బూటకము తప్ప మరేమియు లేదని చెప్పుటకు వలను పడదు.

ఈశ్వర విశ్వాసము మానవ స్వభావమునందు విడదీయుటకు వలవి కానంతగ నిమిడియున్నది. అస్వాభావిక జీవనముచే మన మంతగ ఈశ్వరుని స్మరించుటకు, ప్రార్థించుటకు పూనుకొన కున్నను, స్వాభావికమగు ఈశ్వర విశ్వాసము నానంతటదియె సర్వమునకు ఆధారమై నిలచును. దేహమున ఉచ్ఛ్వాస నిశ్వాసములు సదా జరగును; నెత్తురు నిరంతరము ప్రవహించును. ఆ పనలు తెలిసికొన బడినను తెలిసికొన బడక పోయినను జరుగును. అటులనె యీశ్వర విశ్వాసమును ఎల్లప్పుడు మన జీవితమును నడుపుచుండును. ఆ సంగతి కొన్నికొన్ని సమయములందు మనము బహిరంగముగ కూడ నంగీకరింతుము.

మదాంధులమై పరమేశ్వరుని నేమాత్రము నభిలషింపక స్వేచ్ఛాచారులమై విహరించు నప్పుడు తీవ్రశోధనలకు లోనై అసహాయులమై గతిగానక,

"శా॥ లావొక్కింతయు లేదు, ధైర్యము విలోలంబయ్యె, బ్రాణంబులున్ । ఠావుల్ దప్పెను, మూర్ఛ వచ్చె, దనువున్ డస్సెన్, శ్రమం బయ్యెడిన్; । నీవే తప్ప నితఃపరం బెఱుఁగ, మన్నింపం దగున్ దీనునిన్; । రావే యీశ్వర! కావవే వరద! సంరక్షింపు భద్రాత్మకా!"

అని గజేంద్రుడు విలపించినట్లు విలపింతుము. అట్టి తరుణములందు మనము చూపు ఆర్తభక్తి సహితము వ్యర్థముగాక రక్షణ సాధనముగ పరిణమించుట నెరిగిన పిమ్మట మన ఈశ్వరవిశ్వాసము దృఢపడును. ఈశ్వరుని ప్రార్థించి తమ కష్టములనే గాక యితరుల కష్టములను కూడ తొలగించ గలిగిన జార్జిముల్లరు మొదలగు భక్తుల చరిత్రలు ప్రత్యక్షముగ ఈ రోజులలోను గాంచుచు, మన శక్తులన్నియు నుడిగి నప్పుడైన ఈశ్వరుని వైపున కెట్లు మరలకుండ గలము?

[illegible]-౨౧ తేదిన హిందూదేశస్థులు కూడ ప్రార్థన సలుపవచ్చునని 'రవి' పత్రిక సూచించినది. బ్రిటిష్ సామ్రాజ్యమునకు జెందిన వారెల్లరు నాడు ప్రార్థన సలుపుట భావ్యమనియే మేమును తలంతుము. నిష్కపట హృదయముతో సంపూర్ణముగ బ్రహ్మార్థినులమై, ఈశ్వరుడే యీ దేశ మొసంగిన దాని ననుసరించుటకు సంసిద్ధులమై ప్రార్థన చేయగలిగిన యెడల, నిజముగా లాభమును బడయుదుము. ఈశ్వరుడు తప్పక దారి జూపును. చిక్కులన్నియు తొలగించును. ప్రేమను, ఐకమత్యమును స్థాపించును. కాని స్వార్థము చంపుకొనిననే గాని ప్రార్థన సలుపుటకు అర్హత బడయ జాలము. ముందు స్వార్థ వినాశమునకై యత్నింతుము గాక! మా యిచ్ఛ గాక నీ యిచ్ఛయె నెరవేరు గాక యని ప్రార్థింప గలుగుదుము గాక!

---

ఇంత సొమ్ము ఎందునకు?—

కోటి రూపాయలు వసూలు చేయుటకు ఇప్పుడు కాంగ్రెసు సంఘము వారు పూనియున్నారు గదా. ఇంత సొమ్ము ఎందునకని పలువురు అడుగుచుండుటచే, రాట్నములు వ్యాపింపజేయుటకు, జాతీయ పాఠశాలలు నడుపుటకు ఆ సొమ్ము ముఖ్యముగ వెచ్చింపబడునని మహాత్మ గాంధిగారు 'యంగు ఇండియా' పత్రిక యందు ప్రత్యుత్తర మిచ్చిరి.

---

కేనోపనిషత్తు:—

శ్రీ ఆదిపూడి సోమనాథరాయ కవిగారిచే పద్యకావ్యముగ రచింపబడి ధర్మసాధనియందు వెలువడిన కేనోపనిషత్తును శ్రీ దుగ్గిరాల సూర్యప్రకాశరావు పంతులు బి. ఏ గారు పుస్తకరూపమున ప్రచురించిరి. బ్రహ్మ విచారము పురిగొల్పుటకు ఈ యుపనిషత్తు సాయపడును. మంచి కాగితముపై అచ్చొత్తింపబడినది. వెల పోస్టేజీతో సహా రు ౦-[illegible]. వలసిన వారు "ధర్మసాధని కార్యస్థానము, కాకినాడ" కు ౦-[illegible] పోస్టు బిళ్ళలు పంపిన బడయుగలరు.

---

# బ్రాహ్మ సమాజము.

## విశాఖపట్టణము.

విశాఖపట్టణ బ్రాహ్మసమాజము తరపున శ్రీ వీరేశలింగముగారి పేర శ్రీ కింతాడ నమశ్శివరావు గారు. సుమారు ౧౫౦ అంగహీనులగు బీదలకు అన్నదానము చేసిరి.

నేటి దినమున శ్రీ కింతాడ నమశ్శివరావుగారి గృహమున బ్రాహ్మధర్మ ప్రచారకులగు రొక్కం బాలకృష్ణరావు గారు బ్రహ్మోపాసన సలిపి గృహస్థుని కోరిక ననుసరించి వారి బిడ్డకు శ్రీ వీరేశలింగము గారి సహధర్మచారిణియగు రాజ్యలక్ష్మమ్మగారి నామ మిడిరి. చిన్న శిశువును దయామయుడగు పరమేశ్వరుడు ఆశీర్వదించును గాక.

తాయి లక్ష్మీనారాయణరావు.

---

## దేశీయ ప్రార్థన సమాజము.

ఈ సమాజ స్థాపకులగు చేవూరి మునీశ్వరయ్యగారు, ఇటీవల నెల్లూరు, గుంటూరు జిల్లాలకు బోయియుండిరి. బాపట్లలోను, గుంటూరులోను ప్రార్థన సభలు జరిపిరి. నెల్లూరిలో ఉషా సంకీర్తనము గావించి నెల్లూరిలోను, బాపట్లలోను, బందరులోను, గుంటూరిలోను నరసరావుపేటలోను, బజారు ఉపన్యాసములు నొసంగిరి. నరసారావుపేటలో ప్లీడరు కోటా వేంకట సుబ్బారావు గారి భవనమున ఉపనయన, వివాహోత్సవ సమయమున ప్రార్థన సల్పి, వటువును, వధూవరులను ఆశీర్వదించెను.

మునీశ్వరయ్య,
కార్యదర్శి.

---

## పండిత నిర్మలచంద్రగారు.

మీడ్విలి థియాలజి స్కాలర్ షిప్పు ఉపాధ్యాయము పంజాబునందు చాలకాలము నుండి ప్రచారకులుగ నుండి పాటుపడుచున్నట్టియు పంజాబి సంస్కృత భాషలయందు మంచి పాండిత్యము గలిగినట్టియు పండిత నిర్మలచంద్రగారికి ఒసంగబడెను. అమెరికాలో వారు బడయు శిక్షణమూలమున నింక నెక్కువ సామర్థ్యము, అనుభవము పొంది బ్రాహ్మధర్మ ప్రచారము బాగుగ చేయగలరని నమ్ముచున్నాము. ఈశ్వరుడు వారిని ఆశీర్వదించును గాక!

---

## రొ. బాలకృష్ణరావుగారు.

విశాఖపట్టణమునందు పనిచేయుచున్న బ్రాహ్మమత ప్రచారకులు రొక్కం బాలకృష్ణరావు గారు ఈ నెల ౧౩ వ తేదిన బరంపురమునకు వెళ్ళిరి. ఇక వారచటినుండి ప్రచారము సలుపుదురు.

---

# లేఖలు.

## సోమనాథరావుగారిపై నపనింద.

పిఠాపురములో ఆర్. సి. హెచ్చి. హైస్కూలు ప్రధానోపాధ్యాయ పదవి నుండి విశ్రాంతి గైకొన్న మ॥ రా॥ రా॥ కూచి నరసింహముగారి చిత్రపటము తయారు చేయించుట కని చెప్పి మ॥ రా॥ రా॥ ఆదిపూడి సోమనాథరావుగారు కొంత సొమ్ము వసూలుచేసి దాని నపహరించినారని యొక వదంతి కాకినాడలో బుట్టినది. దీనిని గురించి పలువురు చెప్పుకొనుచుండుటచే నది క్రమక్రమముగా వ్యాపించి సోమనాథరావుగారి గౌరవమునకు భంగము గలిగించునేమో యను భయముచే నే నీ యుత్తరము వ్రాయవలసి వచ్చినది.

సోమనాథరావుగారు క్రిందటి జూలై నెలలో చందాలు వసూలు చేసినమాట వాస్తవము. కాని, ఆసొమ్ము గౌరవసభ జరుపుటకును, నరసింహముగారికి దగిన బహుమతు లొసంగుటకును మాత్రమే వినియోగింపబడును గాని, చిత్రపటము కొఱకు గాదని సోమనాథరావుగా రప్పుడే స్పష్టముగా నందఱితోను చెప్పిరి అదియునుం గాక, ఆసభను గూర్చిన ఆదాయ వ్యయములు తనిఖీ చేయుటకు ముగ్గురు మెంబర్ల సంఘము గూడ నేర్పడియుండెను. వారిలో నే నొకడను. మేము సోమనాథరావుగారి చందా ఖర్చుల జాబితా పరీక్షించి, అంతయు సరిగానున్న సంగతియే గాక, వారు కొంత సొంతసొమ్ము గూడ బెట్టుకొనినట్లు కనుగొంటిమి. అందులకు వా రెంతయు శ్లాఘనీయులు గదా.

కాబట్టి సోమనాథరావుగారు సొమ్మపహరించిరను నింద యెవరో దుష్ట హృదయులచే గల్పింపబడినది గాని, యథార్థము కాదని మనవిచేయుచున్నాను.

పిఠాపురము, ౧౮-౬-౨౧.

జనమంచి సీతారామస్వామి,
సహోపాధ్యాయుడు,
ఆర్. సి. హెచ్చి. హైస్కూలు.

## హీనజాతుల కొక మనవి.

ప్రపంచమునం దే వ్యక్తియు తప్పితము చేయక యుండజాలనట్లు, యే మతోద్యమము పూర్ణమైన సత్యము యొక్కయు, మంగళము యొక్కయు, ఉద్యమమై యుండజాలదు. ఇప్పటివరకును ప్రపంచమునకు గల అనుభవము యిదియే. హిందూమతము యెంతయో ఘనమైనదే గాని, ప్రతివ్యక్తియు ఉత్కృష్టమైన సాంఘిక జీవనమును గడపుటకు తగిన యేర్పాటులు, హిందూమతమునం దిప్పుడు లేకపోయెను. అందుచేత నే సంఘము యింత చీలి సిథిలమై పోయినది. మరల తొంటియట్లు ఉత్కృష్టమైన ఆధ్యాత్మిక జీవనము గల మహాఋషులు పలువురు సంఘములో బయలుదేరిన గాని మన సాంఘిక లోటుపాటులు తీరనట్లు కనుపించుచున్నది. అందుచేత నే ఋషిపుంగవుడైన గాంధిమహాత్ముడు జాతీయ నౌక యొక్క చుక్కానిని పట్టినప్పటినుంచి జాతీయోద్యమము యింత యెక్కువగా సాగి[illegible]చున్నది. యిందుగల రహస్యము రాజకీయ సమస్యల కన్న ముందు సాంఘిక సమస్యలను గూడ పరిష్కరించ ప్రయత్నించుటయే. అందుచే సాంఘిక సమస్యలు రాజకీయ సమస్యల కన్న వేగమే చక్కబడిపోవునని గ్రహించవచ్చును. కాని యెచ్చటనుంచియో సముద్రము మీద నుంచి వచ్చు ఇతరులు దుస్థితియందున్న మన సంఘమును యెంతమాత్రము బాగుచేయుతేరని గ్రహించెదము గాక. కాని క్రైస్తవ మతస్థులు హీనజాతుల వారిని నుద్ధరించి జ్ఞానదీక్ష నొసంగ కంకణము కట్టుకొన్నట్లు చెప్పెదరు. కాని యిందెంత మాత్రము సత్యము లేదు. వారు నిజముగా క్రీస్తు „వెలుగులోనే" బ్రతుకుచుండిన, వారి బోధ అంతయు మాలమాదిగ పల్లెలలో ప్రవహించుట యేలనో? బ్రాహ్మణ అగ్రహారముల దరకైనను జేరలేకపోవుట కేమి హేతువో? మత మనగా యెవో కొన్ని అసత్యములను నమ్మి మహానుభావులు చెప్పిన „వెలలేని వాక్యరత్నములను" దంపుళ్ల పాట క్రింద వల్లెవేయుట అధ్యాత్మికజీవితము గాదని మన జాతులనుండి వెడలెడి క్రైస్తవ మతాంతరులు గ్రహించెదరు గాక. అట్టి శుష్కమత జీవితమా భారతీయులకు కావలసినది? సర్వప్రపంచమునందును పూర్ణత్వమును దర్శించుచు జగదీశ్వరుని యొక్క మంగళాదేశముతో జీవితము అడుగడుగునకు నడపుట అని గ్రహించెదము గాక. మతము ద్వారా మనము యింత మన్నత దశకు పోవలసియుండ, అట్లు యున్నను అభివృద్ధిపొందుటకు తోడ్పడక గుంటపువ్వులు పూయించుటకు తోడ్పడెడి వారి యుద్యమము స్వార్థపరత్వమునకు గాక మరెందుకో?


క్రైస్తవ మతము మన దేశమునందు భేదవృషిని తొలగింపగలిగెనా? యే మహనీయుల దయవల్లనో యొకటో రెండు యింగ్లీషు ముక్కలు నేర్చుకొనినవారిని మాత్రము క్రైస్తవమతము మాచుచుండగా కౌగిలించుకొనును. తక్కిన వారి దరికి అంతగా జేరజాలదు యెందుచేతనో గాని.

కావున ఓ మిడి మిడి జ్ఞాన పండితులారా! తరితరులారా!! నా హీనజాతి సోదరులారా!!! మోసపోకుడు. చూడుడు. హిందూ సంఘమునుంచి సంస్కరణ మహారథము సింహనాదము చేయుచు వచ్చుచున్నది. గాంధి మహాత్ముడు నేను ఒక యేడాదిలో స్వరాజ్యము రావలెనని చెప్పుచు అంతకన్నను ముందే అస్పృశ్యతాదోషము మొదలుగాగల సాంఘిక లోటుపాటులను చక్కబెట్టుకొనవలయునని చెప్పగలిగెను. అట్లెన్నడైనా క్రైస్తవమతస్థులు చెప్పగలిగిరా? దరిద్రులున్నారో, యెక్కువ వ్యయప్రయాసలు కలిగించి అంతిలాభి కారి కాని విద్యాభివృద్ధిమాని పోయి తగిన కార్మికవిద్యలు అందరి అందుబాటునకు యేర్పడిన, చుట్టుముట్టాడు యీదారిద్ర్యము తానంతట అదియే తొలగును. యింక పారమార్థికమన్ననో, దేశము నలువైపులను మేల్కొనెను. భారతవర్షమునందు గల సత్యమును, అంతేగాక సర్వప్రపంచమునందుగల సత్యమును అకర్షించుటకు మహా యజ్ఞములు అప్పుడే ప్రారంభింపనే ప్రారంభింపబడినవి. మనము మేల్కొని వాటి యుపలబ్ధి పొందుటయే తరువాయి. కావునో మహాజనులారా! మనకు కావలసినది భుక్తి ముక్తి. చూడుడు నిజముగా మిమ్ముల నుద్ధరించుచున్నది, మీ భారతనాయకులే. గుర్తెరిగి పాటుపడుడు.

సిరియం, బర్మా.

బోడ చిట్టియ్య.

# Wrist Watches.



రిష్టు వాచీ, లేక, చేతికి ధరించు గడియారము. మంచిరకము "సిలెండరు" వాచీ నిక్కెలు

వెండిది 12" సైజు రు. 6-8-0

డిటో 10" సైజు చిన్నది 9-0-0

రాత్రిలు చీకటిలో కన్పించు "రేడియమ్" చేతిగడియారము రు. 7-8-0

డిటో లీవరు గడియారము 10 కెంపులు గలది ,, 20-0-0

డిటో 15 కెంపులు కల లీవరు రిష్టు వాచీ ,, 25-0-0

---

# చలువ జోళ్లు.

—(\$)—

| | |
|---|---|
| నాలుగు అద్దములు గల మబ్బురంగు జోడు | రు. 6-8-0 |
| డిటో. రెండవ రకము | ,, 5-0-0 |
| డిటో. స్టీరియోస్కోపిక్ అద్దములు | ,, 7-0-0 |
| ప్రిక్కలను "వల్కనైటు" బిళ్లలును మబ్బురంగు అద్దములును గల "లారెన్సు & మేయో" కంపెనీ వారి "Amulet" | ,, 7-8-0 |

క్యాటలాగులు పంపబడును.

వలయువారు:—

యం. హెచ్. రావు అండుసన్సు,

కాకినాడ. (అని వ్రాసికోవలెను.)

# కేసరి — కల్పతరువు.

## లోధ్ర.

గర్భాశయ రోగనివారిణి.

స్త్రీలకు కలుగు ముట్టుశూల, బహిష్టు కాకుండుట, అకాల బహిష్టి, మైలజాస్తిగాను, తక్కువగాను పోవుట, కడుపునొప్పి, సంతానహీనత, రక్తహీనత, మలబద్ధకము, నూతికాసాతము, కీళ్ళనొప్పులు, అరికాళ్ళు, అరచేతులు మంట మొదలగు స్త్రీసుఖ వ్యాధులను కుదుర్చును. 24. ఔ రు. 5. 12 అవున్సుల బుడ్డి రు 3-0-0. 6 అవున్సుల బుడ్డి రు 1-10-0.

## అమృత.

రక్తశుద్ధి ద్రావకము.

ఇది రక్తహీనత, మలబద్ధకము, అజీర్ణము, కీళ్ళనొప్పులు, సోమరితనము, మేహవ్రణములు, సుఖసంకటములు, నిస్సత్తువ, కడుపుబ్బు మంట మొదలగు వ్యాధులను నివారించి శరీరమునకు కాంతి సుఖమునకు తేజస్సును యిచ్చును. 24. అవున్సులు రు. [illegible] 12 అవున్సులు బుడ్డి రు 3-0-0. 6 అవున్సుల బుడ్డి రు 1-10-0.

## అర్క.

సర్వజ్వర నివారిణి.

వాత, పిత్త, కఫ, విషము, సన్నిపాతకొండ, మన్యసముస్త జ్వరములు జ్వరబిళ్ళ విషపడిశ మహోచ్చజ్వరముగ కుదుర్చును. 6 అ రు 2-8-0; 3 అ రు 1-8-0; 1 అ 0-8-0.

కేసరికుటీరం, ఆయుర్వేద ఔషధశాల,

ఎగ్మోర్, మదరాసు.

# P. SUBBAROY.

**Ayurvedic Pharmacy,**

*Sri Venkatesa Perumal koil Sannithy,*

TANJORE.

# పి. సుబ్బరాయి.

ఆయుర్వేద ఔషధశాల,

శ్రీవెంకటేశ పెరుమాళ్ళు సన్నిధి, తంజావూరు.

4. లక్ష్మీకర కస్తూరిమాత్రలు — తాంబూలము ధరించువారు యెప్పుడున్ను చేతులో నే వుంచుకోతగిన మాత్రలు. ప్రసిద్ధమైన వస్తువు. పండ్లనొప్పి, నోటికంపు, అజీర్ణము, పిత్తవాయువు, కలరా, ప్లేగు, వీటిని పోగొట్టును తాంబూలములు గాని, పూటకి గాని భోజనము అయినపిమ్మట 2 మాత్రలను వుపయోగపరిచితే యేలాటి గొప్పభోజనము భోంచేసినాగాని తక్షణం జీర్ణము చేయుటయే గాక నోటిలో అనేక గంటలవరకు సుగంధవాసన యుండును. ప్రతిదినం తెల్లవారి రెండు మాత్రలను లోంటూవచ్చినయెడల బహుకాలముగా వుండె అగ్నిమాంద్యము, మలబద్ధము అజీర్ణమువల్ల కలిగెడు మలబద్ధము, కడుపునొప్పి, గొంతునుంటలు మొదలగు అనేక వ్యాధులను పోగొట్టును ప్రసవ కాలమందు తాంబూలముతో నుపయోగపరచిన సీతిళము దగ్గర జేసీయదు. జన్ని గావుండునపుడు ఈమాత్రలను యిచ్చినయెడల జన్ని పారిపోవును. ఇందులో లాహిరి మొదలగు అపాయకరమైన వస్తువును చేరలేదు. కాశ్మీరదేశములో నుండి మేము నేరుగా రప్పించిన కస్తూరి బంగారు రేకు, పచ్చకర్పూరము మొదలగు హెచ్చు ధరలుగల అనేక మందుసామానులున్ను వాసనద్రవ్యములున్ను జేర్చి చేయబడినవి. తాంబూలముతో వుపయోగపరచితే పచ్చకర్పూరము మొదలగు వాసనవస్తువులను చేర్చవలసిన ఆవశ్యకమేయుండదు. పసిబిడ్డలకు తాంబూలరసములో యిచ్చినయెడల మాంద్యము, దగ్గు జలుబు నివర్తియగును. సీసా 1 కి వెల అణాలు 4, ఇండియాలోకి సీసా 1 టి మొదలు 12 సీసాల వరకు ప్యాకింగు తపాలు శెలవు అణాలు 8 ప్రత్యేకము.

## అమృతాంజనము.

## సుందరమైన 1921 ఉపయోగమైన

## క్రొత్త క్యాలండరు

విక్రియమునకు సిద్ధముగనున్నది.

క్యాలండరు వెల 1 కి 0-4-0 వి. పి. ఖర్చులు సహా 0-6-0

వెంటనె వ్రాసుకొనవలయును.

| లామర తైలము | పండ్లపొడి | మోహినీ తైలము |
|---|---|---|
| డబ్బి 1 కి, 0-6-0 | డబ్బి 1 కి, 0-2-0 | సీసా 1 కి, 0-12-0 |

## అమృతాంజనము

అన్ని నొప్పులకు దివ్యామృతము.

దగ్గు, శైత్యము, పడిశము, రొమ్ము పడిశము, తలనొప్పి, వాయువు నొప్పులు, పోట్లు, బెణుకులు, బిళ్లలు, మొదలగు నొప్పులకు దివ్యామృతము.

చక్కని డబ్బితో సహా వెల రూ. 0-10-0. డజను 1 కి రూ. 6-0-0 పోస్టు ఖర్చులు వేఱు.

## అమృతాంజనము డిపో,

౧౦౯, ఫెర్రిరోడ్డు, ఫోర్టు, బొంబాయి, ౬, తంబు శెట్టివీధి, మద్రాసు.



శ్రీమాన్ వైద్యరత్న పండిత

డి. గోపాలాచార్లుగారు స్థాపించిన

## ఆయుర్వేదాశ్రమము.

41, ఆచారప్పన్ వీధి, జార్జిటవున్, మదరాసు.

ఇందు, మామూలురీతిగా మందులు విక్రయింపబడును.

ప్లేగు, కలరా, ఇన్‌ఫ్లుయెంజా మున్నగు వ్యాధులకును. తదితర వ్యాధులకును మందులు దొరకును.

వ్యాధివివరములను వ్రాసిన, మందులు నిర్ణయించి పంపబడును.

కోరువారికి క్యాటలాగు ఉచితము.

ఎన్. మాధవమీనన్ (ఆయుర్వేదాచార్య)

తంతి విలాసము } డి. దేశికాచార్యులు,

' పండిట్ ', మదరాసు. } జాయింటు ప్రొప్రయిటర్లు.



## ధర్మసాధని.

చందా వివరము.

| | |
|---|---|
| రాజపోషకులకు | వారి యిష్టానుసారము. |
| పోషకులు | రు. ౧౨-౦-౦ |
| సహాయులు | ,, ౬-౦-౦ |
| చందాదారులు | ,, ౩-౦-౦. |

విద్యార్థులకు గాని యెవ్వరికిని గాని చందా తగ్గించుటకు వలను పడదని యిదివరకె తెలుపబడెను. కాన అందునకై ఎవ్వరును వ్రాయకుందురు గాక!

**Reg. No. M. 1094.**

**The Dharma Sadhani, Cocanada.**

(Printed and Published by K. Hanumanta Rao, at the Dharma Sadhani Press, Cocanada.)


V. P. *Rs.* *As.*

**To M. R. Ry.**

61 Jayanti Gaganna garu B. A., L. T.,
Head Master, V. H. School,
Rajahmundry.